క్లుప్తంగా

మద్యం దుకాణం తనిఖీ



పాకాల: మద్యం దుకాణాల్లో స్టాకును ప్రతిరోజూ సరి చూసుకోవాలని చిత్తూరు మద్యం డిపో సబ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణశాస్త్రి ఆదేశించారు. ఆయన గురువారం పాకాల మండలంలోని ప్రభుత్వ మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఎమ్మార్పీకే మద్యాన్ని విక్రయించాలన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

భాకరాపేట: ఆదర్శ పాఠశాలల్లో ఆరో తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎర్రావారిపాళెం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ బీటీ శ్రీదేవి తెలిపారు. ఈ నెల 25వ తేదీ వరకు గడువు ఉందని, జూన్ 11న ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షలో విద్యార్థులు పొందిన మార్కులు, రిజర్వేషన్ ప్రకారం ప్రవేశాలు కల్పిస్తారని వెల్లడించారు. ఆసక్తి గల వారు www.apmr.ap.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓసీ, బీసీ విద్యార్థులు పరీక్ష రుసుం కింద రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మ్యూజియం డే



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ లలిత కుమారి

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి కోటలో గురువారం అంతర్జాతీయ మ్యూజియం డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత నాణేల ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యార్థులకు వ్యాస రచన, డ్రాయింగ్ పరీక్షలు నిర్వహించారు. చంద్రగిరి ఎంఈఓ లలితకుమారి మాట్లాడుతూ మన చరిత్రను భావితరాల వారికి అందించడానికి పురావస్తు శాఖ కృషి చేస్తోందన్నారు. విద్యార్థులు మన సంస్కృతి, చరిత్రను తెలుసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు చంద్రగిరి కోట సీఏ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు.

ఎమ్మెల్యే పెళ్లి కానుక పంపిణీ



పెళ్లి కానుక అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాకాల: మండలంలోని పేరసానిపల్లి పంచాయతీ తురకపల్లిలో వివాహం నిశ్చయమైన ఎస్.షబీన, ఎస్.సుకుమార్, కె.నగీన, మస్తాన్, పి.అలీమ, ఎస్.అమీర్, బీబీఫాతిమా, పి.బర్కత్, ఎస్.షమీద, పి.ఆసిఫ్‌కు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి పెళ్లికానుక పంపించారు. వాటిని గురువారం సర్పంచ్ శాంతమ్మ, రహీం, రమేష్‌రెడ్డి, అజీజ్‌బాష, గోపి, జాఫర్ తదితరులు అందజేశారు. వారు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.

బాబోయ్ ఎండలు..



ట్రాఫిక్ పోలీసుకు గ్లూకోస్, మజ్జిగ పంపిణీ



వాహనానికి ఏర్పాటుచేసిన కప్పు



ఎండ వేడిమికి మజ్జిగ తాగుతున్న కానిస్టేబుల్



తాటి ముంజలు విక్రయిస్తున్న మహిళలు



నిర్మానుష్యంగా ఉన్న సెంట్రల్ పార్క్ సర్కిల్ రోడ్డు



జనాలు లేక బోసిపోయిన మార్కెట్

ఎండలు మండిపోతున్నాయి. ఉదయం ఎనిమిది గంటలకే భానుడు భగభగమంటున్నాడు. ఇంటి నుంచి బయటకు రావాలంటే ప్రజలు భయపడుతున్నారు. తిరుపతి నగరంలో నిరంతరం రద్దీగా ఉండే పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జనాలు లేక ఖాళీగా కనిపించింది. అత్యవసర పనులపై బయటకు వచ్చే వాహనదారులు, ప్రజలు ఒంటినిండా దుస్తులు ధరించి కంటికి చలువ అద్దాలు, తలకు టోపీ పెట్టుకుంటున్నారు. వాహనాలపై పైకప్పు వేసుకుంటున్నారు. తాటిముంజలు కొనుగోలు చేసేందుకు అధిక సంఖ్యలో మక్కువ చూపుతున్నారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులు వడదెబ్బ బారిన పడకుండా జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి చర్యలు తీసుకున్నారు. ట్రాఫిక్ డీఎస్పీ నరసప్ప నేతృత్వంలో ట్రాఫిక్ పోలీసులకు గ్లూకోస్, మజ్జిగ ప్యాకెట్లు అందజేస్తున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి


గంగమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే భూమన, మేయర్



మేయర్ శిరీషకు సారెను అందజేస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఆలయ చైర్మన్, ఈవో

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ జాతర దిగ్విజయంగా ముగియడంతో గురువారం ఉదయం ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మేయర్ శిరీషకు గంగమ్మ పసుపు, కుంకుమ, గాజులు, చీర అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కట్టా గోపియాదవ్, ఈవో ఎం.మునిక్రిష్ణయ్య, పాలక మండలి సభ్యుడు వెంకటేష్, డిష్ చంద్ర, దొడ్డారెడ్డి మునిశేఖర్‌రెడ్డి, ఉదయ్ వంశీ పాల్గొన్నారు.

గంగమ్మ సేవలో శ్రీశైలం ఈవో లవన్న



గంగమ్మను దర్శించుకుంటున్న శ్రీశైలం ఆలయం ఈవో లవన్న

తాతయ్యగుంట గంగమ్మను గురువారం శ్రీశైలం ఆలయ ఈవో లవన్న దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆయనకు అధికారులు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

21 నుంచి గోవిందరాజస్వామి ఆలయ మహాసంప్రోక్షణ





కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేస్తున్న అధికారులు, గోవిందరాజస్వామికి పరదాలు అందజేస్తున్న మణి

- రేపు మహా సంప్రోక్షణకు అంకురార్పణ
- ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుపతి కల్చరల్: ఈ నెల 21వ తేదీ నుంచి 25వ తేదీ వరకు గోవిందరాజస్వామి ఆలయ మహాసంప్రోక్షణ నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. అదేవిధంగా అలాగే గురువారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గోవిందరాజస్వామి ఆలయ సన్నిధితోపాటు ఆలయ ఆవరణలోని ఆలయాల పైకప్పు, గోడలు, పూజ సామగ్రి తదితరాలను నీటితో శుద్ధి చేశారు. అనంతరం నాము కోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలిపిన జలాలను ఆలయం అంతటా సంప్రోక్షణ చేశారు. శనివారం ఉదయం 7.30 నుంచి 9 గంటల వరకు ఆచార్య రుత్విక్ వరణం నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు సేనాపతి ఉత్సవం, మృత్సంగ్రహణం, అంకురార్పణ ఉంటాయి. 21న ఉదయం 8.30 నుంచి 11 గంటల వరకు పుణ్యాహవచనం, రక్షాబంధనం, సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు యాగశాలలో వైదిక కార్యక్రమాలు చేపడతారు. 22న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జలాధివాసం, బింబస్థాపన, మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 8.30 గంటల వరకు మహాశాంతి తిరుమంజనం, యాగశాల కార్యక్రమాలు నిర్వహిస్తారు. 25వ తేదీన ఉదయం 4 నుంచి 7.30 గంటల వరకు కుంభారాధన, నివేదన, హోమం, మహాపూర్ణాహుతి చేపడతారు. తర్వాత 7.45 నుంచి 9.15 గంటల వరకు మిథున లగ్నంలో మహాసంప్రోక్షణ నిర్వహిస్తారు. 10.30 నుంచి భక్తులకు స్వామివారి దర్శనం కల్పిస్తారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు పెద్ద శేష వాహనంపై స్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించనున్నారు.

పరదాల వితరణ

మహాసంప్రోక్షణ, స్వామి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తిరుపతికి చెందిన మణి స్వామి గురువారం మూడు పరదాలు వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో రవికుమార్, ప్రధాన అర్చకుడు శ్రీనివాస దీక్షితులు, సూపరింటెండెంట్ మోహన్‌రావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనుంజయులు పాల్గొన్నారు.

భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని వినతి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

తిరుపతి రూరల్: మండలంలోని పద్మావతి పురం, తిరుచానూరు చెరువు భూములను ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జయచంద్ర కోరారు. ఆయన గురువారం తిరుపతి రూరల్ తహసీల్దార్ టీవీ సుబ్రమణ్యంకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ పద్మావతిపురం పంచాయతీ సర్వే నంబర్ 234లోని దోబీఘాట్‌ను, తిరుచానూరు పంచాయతీ యోగిమల్లవరం సర్వే నెంబర్ 1/1,1/2లోని చెరువును కొందరు ఆక్రమించారని ఆరోపించారు. అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించాలన్నారు. సుమన్, శేఖర్, శేషాద్రి, సూర్య పాల్గొన్నారు.

చల్లబడ్డ తిరుపతి

తిరుపతి తుడా: గడిచిన వారం రోజులుగా తిరుపతి నగరం నిప్పులకొలిమిని తలపించింది. భానుడి భగభగలతో ప్రజలు ఉక్కపోతతో అల్లాడారు. సోమ, మంగళవారాల్లో 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గురువారం మధ్యాహ్నం మోస్తరు వర్షం పడడంతో వాతావరణం చల్లబడింది. చల్లగాలులు వీయడంతో ప్రజలు సేద తీరారు.


వైద్య పరీక్షలు చేయించుకోండి



రక్త పరీక్షల శిబిరాన్ని సందర్శిస్తున్న ఎమ్మెల్యే సతీమణి చెవిరెడ్డి లక్ష్మి

పాకాల: మండలంలోని ఇరంగారిపల్లి, పంటపల్లి, బైనపల్లి, సామిరెడ్డిపల్లి, చెన్నుగారిపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి గురువారం సందర్శించారు. ఆమె మాట్లాడుతూ అందరూ ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశంతో ఎమ్మెల్యే ఈ కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరూ తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. వృద్ధులకు త్వరగా వైద్య పరీక్షలు చేయించాలని, అల్పాహారం అందించి వారిని ఆటోల్లో ఇళ్ల వద్ద దిగబెట్టాలని సూచించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు.

నల్లారి నోరు అదుపులో పెట్టుకో..



మీడియాతో మాట్లాడుతున్న పోకల అశోక్‌కుమార్

తిరుపతి మంగళం: నిత్యం ప్రజాసంక్షేమం కోసం శ్రమించే రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై విమర్శలు తగదని, నోరు అదుపులో పెట్టుకోవాలని నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డికి టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్ హితవుపలికారు. ఆయన గురువారం బైరాగిపట్టెడలోని తన నివాసంలో నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి చేసిన ఆరోపణలపై మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పుంగనూరు, పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె ప్రాంతాల్లోని ప్రజలకు తాగు, సాగునీరు అందిచేందుకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బృహత్ ప్రణాళికతో ఆవుల పల్లె ప్రాజెక్టు నిర్మాణం చేపడుతున్నట్టు తెలిపారు. కమీషన్ల కోసం కక్కుర్తి పడేది మీ నాయకుడు చంద్రబాబు నైజమని ఎద్దేవా చేశారు. గతంలో మీ అన్న నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని ఆరోపించారు. అన్న అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎర్రచందనం చెట్లను నరికి రూ.కోట్లు గడించినది ఎవరో ప్రజలకు తెలుసున్నారు. ఉమ్మడి జిల్లాలో ఎదురులేని నాయకుడైన మంత్రి పెద్దిరెడ్డిపై విమర్శలు చేస్తే మంచి పబ్లిసిటీ వస్తుందనకుంటే ప్రజలు జిల్లా నుంచి తరిమితరిమి కొడతారన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని సూచించారు.

త్రైమాసిక పన్ను రద్దు చేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

తిరుపతి మంగళం: రవాణా రంగంపై పెంచిన త్రైమాసిక పన్నును రద్దు చేయాలి సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేతారి రాధాకృష్ణ డిమాండ్ చేశారు. వారు గురువారం ట్యాక్సీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళంలోని తిరుపతి జిల్లా రవాణాశాఖ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రవాణా రంగంపై త్రైమాసిక పన్నును 80 శాతం పెంచడంతో ట్యాక్సీ, ఆటో తదితర వాహనాలపై పెను భారం పడుతోందన్నారు. కరోనా సమయంలో వసూలు చేసిన త్రైమాసిక పన్నును తిరిగి చెల్లించాలని కోరారు. తిరుపతి నగరంలో ఆగివున్న వాహనాల నుంచి అనధికారికంగా వసూలు చేస్తున్న పార్కింగ్ రుసుంను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. టోల్ ట్యాక్సీ, పంచాయతీ పార్కింగ్ నుంచి మినహాయించాలన్నారు. కార్మికులకు ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ప్రమాద బీమా కింద రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఎన్‌డీ రవి, కేవై.రాజా, విశ్వనాథ్, శివ, ట్యాక్సీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆర్‌వీ రమేష్, నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎల్‌కే నాయుడు, రైల్వే బాల, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రాయలు వైభవాన్ని దశ దిశలా చాటుదాం



మాట్లాడుతున్న రెడ్డిశేఖర్ తిరుమల శెట్టి

తిరుపతి కల్చరల్: దక్షిణ భారతదేశంలో అనేక ఆలయాలు, ఆనకట్టలు, చెరువులు నిర్మించడంతో పాటు ఆధ్యాత్మిక భక్తి చైతన్యానికి దోహదపడిన విజయనగర సామ్రాజ్యాధినేత శ్రీకృష్ణదేవరాయల వైభవాన్ని దశ, దిశలా చాటుదామని రాయల్ పీపుల్స్ ఫ్రంట్ వ్యవస్థాపకుడు రెడ్డిశేఖర్ తిరుమల శెట్టి తెలిపారు. ఆయన గురువారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. శ్రీకృష్ణదేవరాయలు చిదంబరం ఆలయంలోని గోపురాన్ని నిర్మించినట్టు తమ పరిశీలనలో తెలిసిందన్నారు. గోపురం వద్దనున్న శాసనం సైతం తమిళం, తెలుగులో లిఖించినట్టు తెలిపారు. రాయలు నిర్మించిన ఆలయాలపై వరాహం, కత్తి, డాలు, సూర్యుడు వంటి చిహ్నాలు ఉంటాయని తెలిపారు. అంతటి గొప్ప కీర్తి గడించిన రాయల వైభవాన్ని భావితరాలకు అందించడమే లక్ష్యంగా కృషి చేయనున్నట్లు తెలిపారు. ఇందులో బలిజ, కాపు, తెలగవంటి వారు సైతం సమైక్యతతో ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రాయల్ పీపుల్స్ ఫ్రంట్ ప్రతినిధులు నరసింహులు, సుబ్రమణ్యం, వేణురాయల్, విశ్వనాథ్, నాగరాజరాయల్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

భాకరాపేట: ఉపాధి పనులను వేగవంతం చేయడంతోపాటు కూలీల సంఖ్య పెంచాలని చిన్నగొట్టిగల్లు ఎంపీపీ బాలం.యుగంధర్‌రెడ్డి తెలిపారు. ఆయన గురువారం ఉపాధి సిబ్బందితో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ వేసవి సందర్భంగా ప్రభుత్వం కూలీల వేతనాన్ని పెంచిందన్నారు. గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో సభలు నిర్వహించి పనులు ఎంపిక చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో దేవేంద్రబాబు, ఏపీవో, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన సత్రానికి స్థలం కేటాయించరూ!



అంజూరు శ్రీనివాసులుకు వినతిపత్రం ఇస్తున్న నేతలు

రేణిగుంట: శ్రీకాళహస్తీశ్వరుని దర్శనార్థం వచ్చే భక్తుల కోసం విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిత్యాన్నదాన సత్రం నిర్మాణానికి స్థలం కేటాయించాలని గురువారం విశ్వ బ్రాహ్మణ సంఘ నాయకులు ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులును కోరారు. దీనిపై చైర్మన్ స్పందిస్తూ త్వరలో జరగనున్న పాలకమండలి సమావేశంలో చర్చించి స్థల కేటాయింపుపై నిర్ణయం తీసుకుంటామన్నారు. రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ సుబ్రమణ్యం ఆచారి, పట్టణ ప్రముఖులు కొండూరు నంద, ఎం.చంద్ర, వెంకటేష్, విశ్వ బ్రాహ్మణ సంఘ నాయకులు వెంకటేష్ ఆచారి, బ్రహ్మయ్య ఆచారి, నాగరాజు, శంకర్ ఆచారి, ఆనంద్ ఆచారి, ప్రసాద్ ఆచారి పాల్గొన్నారు.

31 నుంచి కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు

- ఏర్పాట్లపై అధికారులతో జేఈఓ వీరబ్రహ్మం సమీక్ష

నారాయణవనం: పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 31న బుధవారం నుంచి జూన్ 8 గురువారం వరకు వైభవంగా నిర్వహించడానికి అందరూ సమష్టి కృషి చేయాలని జేఈఓ వీరబ్రహ్మం ఆదేశించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై గురువారం సాయంత్రం ఆయన ఆలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. పోస్టర్లను ఆవిష్కరించి మీడియాతో మాట్లాడారు. పద్మావతి అమ్మవారి జన్మస్థలమైన నారాయణవనంలో బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. బ్రహ్మోత్సవాల్లో జూన్ 4న గరుడ వాహనం, 7న రథోత్సవం, సాయంత్రం ఆర్జిత కల్యాణోత్సవం నిర్వహిస్తామని, ఉత్సవాల్లో ప్రతి రోజూ ఉదయం 7.30 నుంచి 9.30 గంటల వరకు, రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు వాహన సేవలు నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. గరుడ వాహనం, రథోత్సవం, స్వామివారి కల్యాణోత్సవానికి హాజరయ్యే భక్తులను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి ఇబ్బందులకూ తావివ్వకుండా ఏర్పాట్లు, వసతులు కల్పించాలన్నారు. ఈరెండు రోజులు భద్రత, వైద్య సేవల పరంగా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వాహనాలు, రథం స్థితిగతి ఎలా ఉందో పరిశీలించాలని, ఆలయంతో పాటు పరిసరాల్లో పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రం చేయాలన్నారు. ఘటాటోపం, ఆలయంలో రంగవల్లులు, విద్యుత్ అలంకరణలు ఆకట్టుకునేలా చేయాలన్నారు. భక్తులకు సౌకర్యంగా ఉండేలా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఎస్వీబీసీలో చానల్‌లో ప్రామోలు ప్రసారం చేయాలని సూచించారు. ఆంజనేయస్వామి ఆలయం పక్కన ఉన్న బావిని, వాటర్ ట్యాంకు శుభ్రం చేయాలని, పుష్కరిణిలో చెత్తను తొలగించాలన్నారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు, దాససాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, భక్తి సంగీత కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమీక్షలో టీటీడీ ఎస్‌ఈలు సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, రవాణా విభాగం జీఎం శేషారెడ్డి, డెప్యూటీ ఈఓ నాగరత్న, డీఎఫ్ఓ శ్రీనివాస్, వీజీఓ మనోహర్, ఈఈ మనోహర్, డిప్యూటీ ఈఈ రాఘవయ్య, సీనియర్ మెడికల్‌ఆఫీసర్లు డాక్టర్ నర్మద, డాక్టర్ కుసుమ కుమారి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ తిరుపతికి సహకరించండి



రోడ్లపై చెత్త దిబ్బలను గుర్తించి సూచనలు చేస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా: స్వచ్ఛ తిరుపతికి ప్రజలు సహకరించాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత పిలుపునిచ్చారు. ఆమె గురువారం 7, 8, 9, 37వ డివిజన్లలో శానిటేషన్‌పై తనిఖీ చేశారు. కార్మికుల హాజరును పరిశీలించారు. ప్రతి రోజూ చెత్త సేకరిస్తున్నారా? ఎన్ని గంటలకు చెత్త బండి ఇళ్ల వద్దకు వస్తోంది అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని కూడళ్లలో చెత్త దిబ్బలు ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్ మాట్లాడుతూ చెత్త విషయంలో ప్రతి ఒక్కరికీ స్వీయ నియంత్రణ ఉండాలన్నారు. ఇంటి వద్దకే వచ్చి చెత్త సేకరించేటప్పుడు రోడ్లపై పడేయడం సమంజసం కాదన్నారు. రోడ్లపై చెత్త వేసే వారిని గుర్తించి జరిమానా విధిస్తామని హెచ్చరించారు. 20 శాతానికి పైగా కార్మికులు విధులకు హాజరుకాలేదన్న ఫిర్యాదులు ఉన్నాయని, మేస్త్రీలు, ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లు కార్మికుల హాజరుపై దృష్టి సారించాలని ఆదేశించారు. అటెండెన్స్ చూపించి తప్పుదోవ పట్టించే వారిని ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. అనంతరం నాడు–నేడు అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, ఎంఈ వెంకట్రామిరెడ్డి కార్పొరేటర్ బస్వా గీత, డీఈఈలు గోమతి, రవీంద్రా రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య, టీపీఎస్ శారదాంబ పాల్గొన్నారు.